క్లుప్తంగా

వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేయండి

తహసీల్దార్ నాంచారయ్య

కొల్లిపర: మండలంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని వీఆర్వోలను తహసీల్దార్ జి.నాంచారయ్య ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన వీఆర్ఓలతో మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు పాత మిద్దెలు, గోడలు కూలే ప్రమాదం ఉందని , అలాంటి వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన వసతిని, సౌకర్యాలను కల్పించాలన్నారు. లంక గ్రామాల్లో ఉన్న ప్రజలకు కృష్ణా నదిలోని వరద ఉధృతి పరిస్థితులను చాటింపుల ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు.

విత్తనాలను రైతులు స్వయంగా తయారు చేసుకోవాలి

మున్నంగి(కొల్లిపర): విత్తనోత్పత్తి కోసం వరి సాగు చేస్తున్న రైతులు స్వయంగా వారి పొలంలో మేలైన వరి కేళీలను గుర్తించి వాటిని వేరు చేసి విత్తనాలు తయారు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు పి.రామాంజనేయులు అన్నారు .శుక్రవారం మండలంలోని మున్నంగి గ్రామంలో రైతులకు వరి సాగులో స్వయంగా వరి విత్తనాలు ఏవిధంగా తయారు చేసుకోవాలి అన్న అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు రైతులతో మాట్లాడుతూ విత్తనోత్పత్తి పద్ధతి ద్వారా సేకరించిన వరి విత్తనాలను రైతులు తరువాత సీజన్‌కి వాటిని ఉపయోగించి అధిక దిగుబడులు సాధించవచ్చుఅన్నారు. విత్తనోత్పత్తి పై రైతులకు పలుసూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం అధికారిణి ఎం, శ్రీలతావాణి, జిల్లా డీఆర్‌సి ఏఓ ఎం.రాజవంశీ, ఏఓ కె.వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

30న మోదీ ప్రజావ్యతిరేక పాలనపై సదస్సు

తెనాలి: ప్రధాని నరేంద్రమోదీ దుష్పరిపాలన నుంచి రైతులు, క్రామికులను కాపాడాలని కోరుతూ ఈనెల 30న విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. అన్ని రకాల పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధత, కనీస మద్దతుధర కల్పించాలని, కేరళ తరహా రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించాలనీ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక హక్కులను పునరుద్ధరించాలనే డిమాండ్లతో సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సులో జాతీయ నాయకులు మాజీ ఎంపీ హన్నన్ మొల్లా, వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు పాల్గొంటారని వివరించారు. వీరితో సంఘ తెనాలి అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు ఉన్నారు.

రూ.2లక్షల నిత్యావసర సరుకులు పంపిణీ



తాడేపల్లిరూరల్: అధిక వర్షాల వల్ల పనులు లేక ఇల్లు గడవని పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అండగా నిలబడ్డారు. రూ.రెండు లక్షల విలువైన నిత్యావసర సరుకులను శుక్రవారం ఎంపీపీ దానబోయిన సంతోషరూవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు పేదలకు అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్ల వెంబడి ప్లాస్టిక్, చిత్తు పేపర్లు ఏరుకోవడం, గ్రామంలో చిన్న చిన్న పనులు చేసుకుని జీవించే యానాదులు వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బయటకు వెళ్లలేక పస్తులు ఉంటున్నారని తెలిపారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆర్కే యానాదుల కాలనీలో నివసించే 40 కుటుంబాలకు సుమారు రూ.2 లక్షల విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, ఈమని సొసైటీ అధ్యక్షులు నలుకుర్తి ఏసుపాదం, జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మత్తే ఆనంద్, పెరికలపూడి, మోరంపూడి గ్రామ సర్పంచ్‌లు గంపల గంగాధర్, ఇత్తడి రమేష్, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి తదితరులు పాల్గొన్నారు.

యూసీసీకి వ్యతిరేకంగా రేపు నగరంలో భారీ ర్యాలీ

నెహ్రూనగర్: మణిపూర్‌లో అల్లర్లను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలతోపాటు యూసీసీ (యూనిఫైడ్ సివిల్ కోడ్)కు వ్యతిరేకంగా ఆదివారం నగరంలో ఏసీ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ర్యాలీ పోస్టర్లను వివిధ క్రైస్తవ సంఘ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో క్రిస్టియన్లపై దమనకాండ, హత్యాకాండలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతిబాబు మాట్లాడారు.

తాలూకా హైస్కూలు చరిత్ర సమాప్తం

- శిథిల భవనాలు, వసతుల లేమి, విద్యార్థుల కొరతతో మూసివేత
- 120 ఏళ్ల చరిత్ర కలిగిన విద్యాసంస్థ ఇక జ్ఞాపకమే



బోసిపోతున్న తాలూకా హైస్కూలు భవన సముదాయం



ఏడాది క్రితమే మూసివేసిన తాలూకా కాలేజీ



స్థలం యాజమాన్యం స్వాధీనంలో ఉన్నట్టుగా బోర్డు

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలిలో ఒక్కొక్క వైభవం కనుమరుగవుతోంది. ఒకప్పుడు ఉజ్వలంగా వెలిగిన సంస్థలు ఇక జ్ఞాపకాలుగా మిగులుతున్నాయి. ఇందుకు విద్యాసంస్థలూ మినహాయింపు కాదు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన సంస్కృత కాలేజీ కొన్నేళ్ల క్రితమే మూతపడడం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు 120 ఏళ్ల తాలూకా హైస్కూలు చరిత్ర సమాప్తమైంది. క్విట్ ఇండియా ఉద్యమంలో త్యాగధనుల వెన్నంటి నడిచిన ఆ పాఠశాల, విద్యావ్యాప్తిలో తరగని కీర్తిని సాధించింది. ప్రస్తుతం మూసివేసిన తరగతి గదులను చూసి ఒకనాటి చదువరులకు కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

కాన్వెంట్ల శకం, ఎయిడెడ్ పాఠశాలలపై పాలకుల శీతకన్నుతో తాలూకా హైస్కూలు ఏటికేడాది ప్రాభవాన్ని కోల్పోతున్న విషయం తెలిసిందే. ఏప్పుడో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పై అంతస్తులోని తరగతి గదులు కొన్నింటిని ఎప్పుడో తొలగించారు. మరికొన్నిటిలో తరగతులు నిర్వహించడం లేదు. రిటైరయిన ఉపాధ్యాయుల స్థానంలో భర్తీ చేయక, విద్యార్థులూ తగ్గిపోయారు. గత ఏడెనిమిదేళ్లుగా పదోతరగతి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య 20 లోపే ఉన్నారు. అందులోనూ ఉత్తీర్ణుల సంఖ్య తక్కువే. ఈ పరిణామాలతో 2017–18 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు చేయడం లేదని నాటి కరస్పాండెంట్ ప్రకటించారు. హైస్కూలు ప్రత్యేక అధికారి తరగతులను కొనసాగించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు.

హైస్కూలుపై వివిధ నివేదికలు...

ప్రభుత్వ విద్యాశాఖ తాలూకా హైస్కూలుపై వివిధ నివేదికలను పరిశీలించింది. పటిష్టమైన తరగతి గదులు, లైబ్రరీ, లేబొరేటరీ, కంప్యూటర్ రూమ్, శానిటేషను సౌకర్యాలు...అన్నిటికీ మించి ఫైర్ సేఫ్టీ వంటి వసతులను కల్పించాలని సూచించగా, ప్రస్తుత మేనేజ్‌మెంట్ కమిటీ నిధులు లేనందున నిస్సహాయతను వ్యక్తం చేసింది.

1998 ప్రాంతంలో తరగతి గది గోడ కూలి ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. ఈ కేసులో స్థానిక కోర్టు 2002లో ఇచ్చిన తీర్పులో యాజమాన్యం భారీ పరిహారాన్ని చెల్లించాల్సి వచ్చింది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే తమ కమిటీ సభ్యులు ఎలాంటి బాధ్యత వహించరని తేల్చిచెప్పింది. దీనితో హైస్కూలు గుర్తింపును రద్దుచేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి గత మే 17న ఉత్తర్వులు జారీ చేశారు. స్కూలు రికార్డులను మరో పాఠశాలకు అప్పగిస్తూ అరకొరగా ఉన్న విద్యార్థులకు టీసీలిచ్చి పంపేశారు. ప్రస్తుతం ఆ స్థలం మేనేజ్‌మెంట్ కమిటీ ఆధీనంలో ఉంది.

ఒకప్పుడు కీర్తి....

విద్యారంగంలో ఒకప్పుడు విరాజిల్లిన తాలూకా హైస్కూలు కొత్తపేటలో 5 ఎకరాల స్థలంలో 1903లో ప్రారంభమైంది. నాటి తెనాలి గ్రామపంచాయతీ అధ్యక్షుడు చెమిటిగంటి సుబ్రహ్మణ్యశాస్త్రి దాతల సాయంతో తెనాలి తాలూకా హయ్యర్ సెకండరీ హైస్కూలు పేరుతో ఈ పాఠశాలను స్థాపించారు. దాదాపు 30 గ్రామాల్నుండి విద్యార్థులు ఎడ్లబండ్లపై వచ్చేవారు. తొలి ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటరత్నం. తెనాలికి తాలూకా హోదా వచ్చాక తాలూకా హైస్కూలుగా వ్యవహరిస్తున్నారు.

హైస్కూలు కమిటీచే నిర్వహణ. ఉద్దండులైన విద్యావేత్తలు ప్రధానోపాధ్యాయులుగా, ఉపాధ్యాయులుగా చేస్తూ, విద్యార్థులను తీర్చిదిద్దడంతో ఉన్నతస్థాయికి ఎదిగిది. మూడు వేలమంది విద్యార్థులు, 80 పైగా ఉపాధ్యాయులతో నడిచి, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో రెండో ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపును పొందింది. హైస్కూలు విద్యార్థులు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఆందోళనలో చురుకుగా పాల్గొన్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు జొన్నలగడ్డ శివసుందరం విద్యార్థులను ప్రోత్సహించి, బ్రిటిష్ అధికారులకు కంటగింపయ్యారు. బాలబంధు టీఎస్ నారాయణ, బహుగ్రంథకర్త వెంపటి పురుషోత్తం, ఎస్ఎస్ఆర్‌కే శర్మ, చామర్తి వెంకటరామయ్య వంటి హెచ్‌ఎంలు, ములుకుట్ల సదాశివశాస్త్రి, చావలి వామనమూర్తిశాస్త్రి, బులుసు సూర్యప్రకాశశాస్త్రి, మల్లాది దేవేంద్రుడు, శ్రీహరి సాంబశివశాస్త్రి, పులిగడ్డ సుబ్బారావు, శతావధాని ములుకుట్ల కృష్ణశాస్త్రి వంటి పండితులు ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో 1947లో శిష్ట్లా విశ్వనాథశాస్త్రి, 1957లో పి.ఆంజనేయులు రాష్ట్రంలో ప్రథమంగా వచ్చారు. పదోతరగతి వచ్చాక 1980లో పాటిబండ్ల వేణుగోపాల్ రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించారు.

ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో ఉన్నత స్థాయిలో....

1969లో హైస్కూలు కాలేజి స్థాయికి ఎదిగింది. మారీసుపేటలో బ్రాంచి హైస్కూలును ప్రారంభించారు. 1972లో శారద ప్రైమరీ స్కూలును అనుబంధంగా స్థాపించారు. క్రీడామైదానం, లేబొరేటరీ, లైబ్రరీ అన్నీ సమకూరాయి. ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో దేశవిదేశాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారు. ప్రసిద్ధ మూత్రపిండాల నిపుణుల్లో ఒకరైన జేసీఎం శాస్త్రి, ప్రఖ్యాత చిత్రకారుడు చావలి నాగేశ్వరరావు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, జస్టిస్ పీఎల్ఎస్ శర్మ, సినీనటి వహీదా రెహమాన్, సూపర్‌స్టార్ కృష్ణ, ఏవీఎస్, డాక్టర్ గోవిందరాజుల సుబ్బారావు, పాతూరి రామకృష్ణ, క్రీడాకారులు ఎల్ఎల్‌వీజీ కృష్ణమూర్తి, అవధాని, రూపాకుల శ్రీలక్ష్మి వంటి ఎందరో ఇక్కడి పూర్వవిద్యార్థులే. ఎందరో ఉపాధ్యాయులు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. ఇంత విశిష్టత కలిగిన పాఠశాల బ్రాంచి హైస్కూలు కొన్నేళ క్రితమే మూతబడింది. ఏడాదిక్రితం కాలేజిని మూసివేశారు. ఇప్పుడు తాలూకా హైస్కూలు, శారదా ప్రైమరీ స్కూలు ఇదే బాటలో మూతపడ్డాయి.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ జశ్వంతరావు



తెనాలిఅర్బన్: వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం .జశ్వంతరావు తెలిపారు. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయంకావడం, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నివారించవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం, ఖాళీ కొబ్బరిబొండాలు, టైర్లు, పాత వస్తువుల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. వేడి వేడి ఆహార పదార్థాలు తింటూ, కాచి చలార్చిన నీటిని తాగాలని చెప్పారు. దోమలు కుట్టకుండా దోమతెరలు, నిండుగా ఉండే వస్త్రాలను ధరించాలని సూచించారు. తడిచిన ఎలక్ట్రికల్ స్విచ్ బోర్డులను ఉపయోగించరాదన్నారు. ఎక్కడైన ఎలక్ట్రికల్ వైర్లు తెగి ఉంటే వెంటనే ఆ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఇంటి పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, నీరు నిలిచి ఉంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బందులు కలిగిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ : 1800 4256 468 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తెనాలిటౌన్: డివిజన్ పరిధిలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు శని, ఆదివారాల్లో పని చేస్తాయని, వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఏపిసిపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వివి.చిరంజీవి శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి, అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న కృష్ణమ్మ వరద ఉధృతి



రెండవ రోజు నిలకడగా కొనసాగుతున్న కృష్ణమ్మ వరద ఉధృతి

కొల్లిపర: గత కొన్ని రోజుల నుంచి కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు సాగర్ డ్యామ్ నుంచి గురువారం సాయంత్రం కూడా సుమారు 1.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు వదిలిన కారణంగా రెండోవ రోజు శుక్రవారం కూడా కృష్ణా నదిలో వరద ఉధృతి కొనసాతుంది. దీంతో మండల పరిధిలోని లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీఓ వి.చంద్ర మోహన్ అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, తహసీల్దారు ప్రజలతో, రైతులతో మాట్లాడుతూ నదిలోకి వరద నీరు గురువారం కన్న ఎక్కువ చేరడం వల్ల లంక గ్రామాలకు, కూలీ పనులకు వెళ్లే వారు వరద ఉధృతి తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పడవ వేయు వారు రాత్రి సమయంలో తప్పని పరిస్థితిలోనే మాత్రం పడవ వేయాలని, పడవ వేసే సమయంలో గ్రామ వీఆర్ఓకి సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు. నదిలో వరద ఉధృత్తి పూర్తిగా తగ్గే వరకూ పిల్లలు, వృద్ధులు ఇటు వైపు రాకుండా ఉండేలా వీఆర్ఓలు, వీఆర్ఏలు తగు చర్యలు తీసుకోవాలి అన్నారు. లంక గ్రామాల్లో, ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలి సిబ్బందికి ఆదేశించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ సర్పంచ్‌లు, పోలీస్ సిబ్బంది, వీఆర్ఓలు ఎప్పటి కప్పుడు వరద ఉధృతి, గ్రామాల్లోని పరిస్థితులు పరిశీలిన చేస్తు తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్ రవీంద్ర రెడ్డి, కొల్లిపర మాజీఎంపీటీసీ భీమవరపు సంజీవ రెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, అవుతు పోతిరెడ్డి, వీఆర్ఓలు, వీఆర్ఏలు, ప్రజలు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



తెనాలిటౌన్: భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేతలు శుక్రవారం పరిశీలించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామ పరిధిలో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పైరు వర్షాలకు నీట మునిగింది. డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీలతావాణిలు పొలాల్లో పంటను పరిశీలించారు. అనంతరం వారు ఆర్బీకెలో రైతులతో మాట్లాడారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వర్షాలకు వెద పద్ధతిలో సాగు చేసిన వరి పైరు పూర్తిగా దెబ్బతిందన్నారు. వరి సాగు చేపట్టదలచిన రైతులు 140 రోజుల పంటకాలం కలిగిన విత్తనాలను నేరుగా విత్తే పద్ధతిలో సాగు చేయవచ్చన్నారు. ఎంటియు1224(మార్టూరు సాంబ), ఎన్‌డిఎల్ ఆర్–7, బిపిటి 2782 రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. విత్తనాలను తప్పని సరిగా విత్తనశుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకె వ్యవసాయ సహాయకులు నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

తెనాలి డివిజన్ విద్యుత్ ఉద్యోగుల నిరసన

తెనాలి: ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు ప్రకారం ఏపీసీపీడీసీఎల్ తెనాలి డివిజన్ కార్యాలయం ఎదుట శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామసమయంలో నిరసన నినాదాలు చేశారు. తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని నినాదాలు చేశారు. తెనాలి డివిజన్ జేఏసీ చైర్మన్ వై.రాజు, కార్యదర్శి పీవీ సుధీర్, కన్వీనర్ ఆర్.మోహనరావు ఉద్యోగుల సమస్యలపై ఈనెల 20న యాజమాన్యంకు మెమొరాండం ఇచ్చినప్పటికీ స్పందన లేనందున ఆందోళన చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చిన దశలవారీ ఆందోళనలో భాగంగా సమస్యలు పరిష్కరించకుంటే ఆగస్టు 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని స్పష్టంచేశారు. తెనాలి డివిజన్ ఈఈ, ఏడీఈలు, అన్ని సెక్షన్ల ఏఈలు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు

ఎమ్మెల్యే శివకుమార్



డీఎల్‌డీఓగా పదోన్నతి పొందిన శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, అధికారులు

కొల్లిపర: ప్రతి ఉద్యోగి వారికి కేటాయించిన విధులు అంకిత భావంతో నిర్వహిస్తే ప్రజల్లో మంచి గుర్తింపుతోపాటు విధులల్లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పాలకేంద్రం కల్యాణ మండపంలో ఎంపీడీఓగా ఉత్తమ సేవలు అందించి పదోన్నతి పై డీఎల్‌డీఓగా ప్రమోషన్‌పై వెళ్లిన పి.శ్రీనివాసులు, ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న సమతవాణి ఎంపీడీఓగా, డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణారెడ్డి తహసీల్దారుగా పదోన్నతిపై వెళ్లిన వీరికి ఆయా శాఖ అధికారలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సభ కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్ర మోహన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీతి నిజాయతీగల ఉద్యోగస్తులు ఎక్కడ ఉన్నా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఏఓ కె.వెంకటరావు, సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదనరెడ్డి , మండల ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసు బాబు , ఆయా శాఖాధికారులు పాల్గొన్నారు.

వినర్చర్ ఐటీతో గుప్తా, చంద్రకళ కళాశాలల అవగహన ఒప్పందం



కళాశాల ప్రతినిధులతో వినర్చర్ ఐటీ బృందం

తెనాలిరూరల్: పోటీ ప్రపంచంలో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పట్టణానికి చెందిన వినర్చర్ ఐటి సంస్థ ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేస్తోంది. దీనిలో భాగంగా స్థానిక గుప్తా డిగ్రీ కళాశాల, చంద్రకళ పీజీ కళాశాలలతో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విద్యార్థులకు ఐటీ రంగాల్లో మెరుగైన శిక్షణతో పాటు, ఆకర్షణీయమైన వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వినర్చర్ ఐటి సంస్థ డైరెక్టర్ వి.సంపూర్ణ కుమార్ చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అవగాహన ఒప్పంద కార్యక్రమంలో టెక్నికల్ అండ్ సాఫ్ట్వేర్ విభాగ ధిపతి ఎస్. అవినాష్ , బిజినెస్ హెడ్ కె. రమేష్ బాబు, కళాశాల ప్రిన్సిపల్ జె. విజయ్ కృష్ణ, వి.నాగరాజు, టి. అశ్విని, మేనేజర్ శ్రీనివాసరావు, ఏ.బాల గోపాల్ , రాజేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన



అవగాహన ప్రదర్శన

తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ యడ్ల లింగయ్య కాలనీలో నివసిస్తున్న చెత్త ఏరుకుని జీవించే కుటుంబాలకు (వేస్ట్ పికర్స్) ఆరోగ్యం–పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక న్యాయవాది కేసీ బసవయ్య, అంగన్‌వాడి టీచర్ అనిత అవగాహన కల్పించారు. వర్షాకాలం వచ్చినందున వేస్ట్ పికర్లందరూ తగిన జాగ్రత్తలను తీసుకోవాలని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వేడి ఆహారాన్ని తీసుకోవాలనీ, వేడి నీళ్లను తీసుకోవటం వల్ల ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. వర్షాకాలంలో పిల్లలను బయటకు పంపొద్దనీ, వర్షపునీటిలో తిరిగితే జ్వరం , దగ్గు, కురుపులు వచ్చే అవకాశం ఉందని అంగన్‌వాడి టీచర్ సునీత చెప్పారు. ఏదైనా అనారోగ్యం కలిగితే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, వైద్యుల సూచన ప్రకారం మందులు వాడాలన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సిటీ కో–ఆర్డినేటర్ బందెల రమేష్ మాట్లాడుతూ పిల్లలను ఇంటిదగ్గర ఉంచటం లేదా తమ వెంట తీసుకెళ్లటం చేయకుండా, అందరినీ స్కూలుకు పంపాలని సూచించారు. చదువుకోవటం వల్ల పిల్లల భవిష్యత్ బాగుంటుందని చెబుతూ, పిల్లల్ని చదివించటానికి ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద ఏటా డబ్బులు కూడా ఇస్తోందని గుర్తుచేశారు. మద్యపానం చేసేవారు, ఇకనైనా ఆపాలని, లేకుంటే కుటుంబాలు నష్టపోతాయని చెప్పారు. వేస్ట్ పికర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శన చేశారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటోలోని లౌడ్ స్పీకర్లను తొలగిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

తెనాలిరూరల్: నిబంధనలు పాటించకుండా ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా స్థానిక వియస్సార్ అండ్‌ఎన్‌వీఆర్ కాలేజీ వంతెన వద్ద ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్ శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వంతెన వద్ద మకాం వేసి తెనాలి – నంది వెలుగు మార్గంలో రాకపోకలు సాగించే ఆటోలను తనిఖీలు చేశారు. ఆటోల్లో టేప్ రికార్డులు, స్పీకర్ బాక్సులను గుర్తించి వాటిని తొలగించారు. పెద్ద సౌండ్‌తో టేప్ రికార్డులు పెడుతూ ప్రయాణీకులకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదని జోగి శ్రీనివాస్ హెచ్చరించారు. గతంలోనే ఈ విషయంపై హెచ్చరికలు చేయడం జరిగిందని కానీ డ్రైవర్లు నిబంధనలు పాటించడం లేదన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై స్పందించి డీఎస్పీ జనార్ధనరావు ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు. 15 ఆటోలను గుర్తించి స్పీకర్లు తొలగించినట్లు చెప్పారు. ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ప్రతి రోజు ఉంటుందని, పట్టణంలో ఉన్న ఆటో డ్రైవర్లు, ఓనర్లు స్వచ్ఛందంగా ఆటోల్లో ఉన్న టేప్ రికార్డులు, సౌండ్ బాక్సులు తొలగించవలసిందిగా ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్ కోరారు.

కొలకలూరు-అనుమర్లపూడి డొంక రోడ్డు పనులు ప్రారంభం



పూజ చేసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తెనాలిటౌన్: ఎన్నో ఏళ్ళుగా అభివృద్ధికి నోచుకుని కొలకలూరు–అనుమర్లపూడి డొంక రోడ్డు పనులను ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు పార్టీ నాయకులు పూజలు చేసి, కొబ్బరికాయలుకొట్టి పనులను ప్రారంభించారు. రూ.52 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు అభివృద్ధిలో భాగంగా రోడ్డు పనులను ప్రారంభించినట్లు ఎంపీపీ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామస్తులు రోడ్డుతో పలు ఇబ్బందులు పడ్డారని, వర్షం వస్తే నడిచే పరిస్థితిలేదని, ఎమ్మెల్యే శివకుమార్ సహకారంతో రోడ్డు నిర్మాణం చేపట్టామని ఎంపీపీ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కాలిశెట్టి ఫణీకుమార్, చెక్కా సీతమ్మ, పిఆర్‌డిఈ గుప్తా, ఏఈ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పినపాటి అనిల్‌కుమార్, మల్లవరపు బుల్లయ్య, రావూరి జీవియర్, ఉన్నం గోవర్ధన్, నలుకుర్తి చందు, కాకుమాను నిరీక్షణ రావు, ప్రసాదం రాధారావు, పొమర్తి సుబ్బారావు, కడియాల శివరామబ్రహ్మం, తాపీమేస్త్రి బాజి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తన పథకంపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిన పాలెంలో రైతులకు గ్రామ విత్తన పథకంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.హైమావతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి రావాలన్నా, నాణ్యమైన పంట పండాలన్నా మూల విత్తనం నాణ్యంగా ఉండాలని రైతులకు వివరించారు. 30 మంది రైతులకు బీపీటీ 5204 రకం మూల విత్తనం, 7.5 ఓటీఎస్‌ను రైతులకు పంపిణీ చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. మొలక శాతం, విత్తన శుద్ధి, సస్యరక్షణ, పిలక దశల్లో నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, వేప నూనె, వేప పిండిల వాడకం తదితర అంశాలను రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారి పి.శిరీష మాట్లాడుతూ రైతులు పైపాటుగా అధికంగా ఎరువులు, పురుగుమందులు వినియోగించడం ద్వారా ఖర్చులు పెరుగుతాయని, అవసరమైన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సస్యరక్షణ చర్యల ద్వారా ఖర్చు తగ్గించుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో చినపాలెం గ్రామ సర్పంచ్ వాసిరెడ్డి ప్రదీప్, ఏఈఓ ఎ.రమేష్, గ్రామ వ్యవసాయ అధికారులు అలేఖ్య, సౌమిత్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో తాడేపల్లి పోలీసులు కనకదుర్గ వారధి వద్ద విస్తృత తనిఖీలు చేపట్టారు. సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ బైపాస్ రోడ్ వద్ద ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి తనిఖీలు ప్రారంభించామని, ముఖ్యంగా మైనర్లు, లైసెన్స్ లేనివారు ద్విచక్రవాహనాలు నడపడం, కొంతమంది పాత నేరస్తులు వాహనాలను దొంగిలించి వాటిపై చక్కర్లు కొడుతూ నేరాలకు పాల్పడుతుండడంతో వాటిని నివారించేందుకు తనిఖీలు చేపట్టామని, తనిఖీల్లో భాగంగా పాత నేరస్తులను గుర్తించేందుకు ప్రతి వాహనచోదకుడి వద్ద నుంచి ఫింగర్ ప్రింట్స్ తీసుకుంటున్నామని, ఎక్కడైనా కేసులు నమోదై ఉంటే ఆ సమాచారంతెలుస్తుందని, ఇప్పటి వరకు 150 మందిని తనిఖీ చేయగా సరైన పత్రాలు లేక ఆరు ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com